# మూలసత్రం

ఆ ప్రాంతం నాకు కొత్త కాకపోయినా ఏడేళ్లలో నేను ఊహించనంతగా మారిపోయింది. రాత్రి పదీ ఇరవయి అయింది. ఒక మోస్తరుగా వర్షం కురుస్తోంది. వెనకసీట్లో హేమలత నిద్ర పోతోంది. కారు నెమ్మదిగా నడుపుతున్నాను. వయిపర్లు ఉండుండి కదులుతున్నాయి. అలవాటయిన దారి అయి ఉంటే ఎటువంటి ఇబ్బంది పడి ఉండేవాడిని కాదు. దారి మంచిగా లేదు. ఎక్కడ గుంటలు ఉన్నాయో, ఎక్కడ లేవో తెలియడం లేదు.

ఉదయం విజయవాడలో బయల్దేరినప్పుడు చిన్నయసూరి డ్రయివరును ఇస్తానంటే నేనే వద్దన్నాను. అప్పటికి వర్షం లేదు. పగలవటాన గమ్యం వరకు ప్రయాణం సజావుగానే సాగింది. తిరిగి ఎంత త్వరగా బయల్దేరి వచ్చేద్దామనుకున్నానో అంత ఆలస్యం అయింది. రాత్రికి విజయవాడ చేరుకుంటాననుకున్నాను. రేపు ఉదయం ఫ్లయిటులో హైదరాబాద్, అక్కడి నుండి సాయంత్రానికల్లా ఢిల్లీలో ఉండాలి. కార్యక్రమం బిగుతుగా ఉంది. చీరాలలో బయల్దేరినప్పుడు వర్షం ఎదురవుతుందని అనుకోలేదు. వచ్చినంత తేలికగా వెళ్ళొచ్చు అనుకున్నాను. వర్షంలో దారి తప్పినట్టున్నాను, అసలు ఎక్కడ ఉన్నానో తెలియడం లేదు. రాత్రికి విజయవాడ చేరుకోవడం కష్టం. కొద్దిసేపు ఎక్కడయినా ఆగి విశ్రాంతి తీసుకుంటే కాని నా బుర్ర పనిచేసేట్టు లేదు.

పది నిమిషాలు ప్రయాణం చేశాక ఊరు చివర 'ఉదయనివాస్' అని రాసి ఉన్న బోర్డు కనిపించాక నా ప్రాణం లేచి వచ్చింది. రెండు అంతస్తుల భవనం కొత్తగా కట్టినట్టుంది. అది ఒఠి లాడ్జో, బోర్డింగ్ కూడా ఉందో తెలియడం లేదు. బోర్డింగ్ ఉంటే బావుండు. తినడానికేమయినా దొరుకుతాయి. బోర్డు మీద ఏమీ రాసి లేదు. ఒఠి లాడ్జి అయితే ఒక గది తీసుకుని తెల్లవారే వరకు ఉండొచ్చు.

హేమలత కోసం కారు మంచిది తీసుకున్నా ఇంత టీడియస్ ప్రయాణానికి ఆమె తట్టుకుంటున్నట్టు లేదు. బయటకు కనబడేంత ఆరోగ్యవంతురాలు కాదు.

హోటలు కాంపౌండు గేటు బార్లా తెరిచి ఉంది. బయట నాలుగయిదు కార్లు, పదివరకు మోటారు బయిక్‌లు పార్కు చేయబడి ఉన్నాయి. గోడ పక్కగా కారాపి తలుపు కొద్దిగా తెరిచాను. లయిటు వెలిగింది. హేమలత వంక చూశాను. బాగా అలసిపోయినట్టుంది, నిద్రలోంచి లేవలేదు. అదృష్ట వంతురాలు. చిటికెలో నిద్రలోకి జారుకుంటుంది. నాకు అలా కాదు. ఒహ పట్టాన నిద్ర పట్టదు. రోజులో అయిదుగంటల పాటు నిద్రపడితే గొప్ప. కారు దిగి తలుపు మూశాను. కారులో ఉన్నప్పుడు తెలియలేదు కాని వర్షం బాగానే కురుస్తోంది. పరుగెత్తుకుంటూ వెళ్ళి హోటలు ముఖద్వారం తలుపు తట్టాను.

నిమిషం తర్వాత గడియ తీసిన చప్పుడు వెనకే తలుపు తెరుచుకుంది. తలుపు తెరిచిన అతనికి ఇరవయి అయిదేళ్ళ కన్నా ఎక్కువ ఉండవు. సన్నగా, నల్లగా ఉన్నాడు.

"నాకు గది కావాలి"అన్నాను.

"వర్షంలో తడుస్తున్నారు. ముందు లోపలికి రండి" అన్నాడు.

జేబులోంచి రుమాలు తీసి ముఖం తుడుచుకుంటూ జల్లుతో పాటు లోపలికి వచ్చాక, "బాగా తడిచి పోయారు" అన్నాడు.

"బయట కారులో నా భార్య ఉంది. మాకో గది కావాలి" అన్నాను.

హోటలు పెద్దదేం కాకపోయినా శుభ్రంగా ఉంది. ఆతను తెల్లటి పేంటు మీద బూడిదరంగు టి.షర్టు వేసుకున్నాడు. అతనిలో నన్ను ఆకట్టుకుంది అతనినవ్వు. మనిషికి నవ్వు కొత్త అందంఇస్తుంది. తల అడ్డంగా ఆడించి నవ్వుతూ, "సారీ అండీ. ఒక్క గది అయినా ఖాళీగా లేదు" అన్నాడు. మాటలో మన్నన ఉంది.

"నాపేరు మణిలాల్. ఇక్కడి వాడినే. ఢిల్లీలో ఉంటున్నాను. పనిమీద చీరాల వెళ్ళి తిరిగి విజయవాడ వెళ్తూ వర్షం వలన ఆగిపోవలసి వచ్చింది."

"విజయవాడ వెళ్ళవలసిన వాళ్ళు ఇటెందుకు వచ్చారు?"

నా అనుమానం నిజం అయింది. దారి తప్పాను. "ఇదే ఊరు?" అడిగాను.

"చందోలు".

నేను చాలా దూరం లోపలికి వచ్చేశాను. మధ్యలో ఎక్కడో ఒకచోట కారాపి ఎవరినయినా అడిగి ఉంటే బావుండేది.

"తువ్వాలు ఇస్తాను. ముందు తల తుడుచుకోండి" అని నేను వద్దంటున్నా బీరువా తలుపు తెరిచి కొత్త తువ్వాలు తీసి నాకు అందించాడు.

తల తుడుచుకుంటూ, "గది..." ఆగాను. నేను ఎవరినీ ఏదీ అభ్యర్థించను. నా మాటలో అభ్యర్థన ఉన్నట్టు అనిపించింది.

"మీతో నేను అబద్ధం చెప్పడం లేదు. ఈ రోజు మధ్యాహ్నం వరకు సగం గదులు ఖాళీగానే ఉన్నాయి. రేపు ఈ ఊళ్ళో ఒక పెద్దాయన కూతురు పెళ్ళి ఉండడం వలన గదులన్నీ నిండిపోయాయి."

"దగ్గరలో మరో హోటలేదయినా ఉందా?"

"లేదండీ".

ఎక్కడలేని నిరుత్సాహం నన్ను ఆవరించింది. ఏం చేయాలో నాకు అర్థం కావడం లేదు. నేను ఒక్కడినే అయి ఉంటే తేలికగా తీసుకునేవాడిని. "ఈ హోటలు నీదా?" అడిగాను.

"కాదండీ. నేనిక్కడ పని చేస్తుంటాను."

తువ్వాలు అతనికి తిరిగి ఇచ్చేస్తూ, "నీ పేరు?" అడిగాను.

"వరప్రసాద్."

"ఈ హోటలు ప్రొప్రయిటరు పేరేమిటి?"

చెప్పాడు.

"నేనతనితో మాట్లాడొచ్చా?"

అతని ముఖంలో అదే నవ్వు. తొణకకుండా, "తప్పకుండా. ఆయన ఫోను నెంబరు. .. ఈ కార్డులో ఉంది. మాట్లాడండి." అని రిసీవరు నా ముందుకు జరిపాడు.

గదులు ఖాళీగా ఉన్నా కస్టమర్ల అవసరం కొద్దీ ఎక్కువ డబ్బులు గుంజడానికి గదులు ఖాళీగా లేవని చెప్పడం సామాన్యంగా జరిగే విషయం. నేను ఎవరినో చెప్పుకుంటే ఈ హోటలు ప్రొప్రయిటరు నాకు గది తప్పకుండా ఇస్తాడు. డయలు చేయబోయి ఆగాను. చేయాలనిపించలేదు. క్రెడిల్ చేశాను. అక్కడ ఉండాలనిపించ లేదు. వెనక్కి తిరిగి తలుపు వయిపు నడవబోతోంటే, "సార్" అన్నాడు.

ఆగాను.

"మీకు ఎటువంటి అభ్యంతరం లేకపోతే మీరు నా గది ఉపయోగించు కోవచ్చు" అన్నాడు.

"నువ్వు ఇక్కడ ఉంటుంటావా?"

తలూపాడు.

"నీగది చూపించు."

అతని గది చూపించాడు. డబుల్ బెడ్‌రూం. బావుంది. మంచం పక్కనే ఉన్న బల్ల మీద చాలా పుస్తకాలున్నాయి. పిల్లల గుడ్డలు చక్కగా మడిచిపెట్టి ఉన్నాయి.

"నీ గది మాకిస్తే నువ్వు ఎక్కడ పడుకుంటావు?"

"నా గురించి మీరేమీ బాధపడకండి. చాలాసార్లు రాత్రంతా మెలకువగా ఉంటాను. అంతగా నిద్ర పోవాలనిపిస్తే ఇదో ఈ సోఫాలో పడుకుంటాను. ఇంతకూ మీకు నా గది నచ్చిందా?"

తలూపి, "నీ గది మాకు ఇచ్చినందుకు మీ ప్రొప్రయిటరు నీ మీద అరవడా?" అడిగాను.

"అరవడు. నా గురించి ఆయనకు బాగా తెలుసు"

బ్రెడ్, పాలు తీసుకున్నాక హేమలత అతని గదిలో పడుకుంది.

వరప్రసాద్ మా ఇద్దరి కోసం చపాతీలు, ఆమ్లెట్లు చేశాడు. కలిసి భోజనం చేశాం. ఆదరణలో నాకు తెలియని విషయాలు అతనికి తెలుసన్నట్టనిపించింది. ఆ తర్వాత గదిలోకి వెళ్ళి పడుకున్నాక కొత్త ప్రదేశం అవడం వలనో, రేపునేను చేయవలసిన పనులు గుర్తు రావడం వలనో వెంటనే నిద్రపట్టలేదు. చాలాసేపు మెలకువగా ఉండి గది బయటకు వచ్చాను. అతను సోఫాలో కూర్చుని లావుపాటి పుస్తకం చూస్తూ నోట్సు రాసుకుంటూ ఉన్నాడు. అతని పనికి అంతరాయం కలిగించాలని అనిపించలేదు.

ఢిల్లీ చేరిన వెంటనే నేను చేసిన పని – నా పర్సనల్ సెక్రటరీని పిలిచి వరప్రసాద్‌ను మా హోటలులో మేనేజరు (హెచ్.ఆర్)గా నియమిస్తూ ఒక ఉత్తరం రాసి అతని చిరునామా ఇచ్చి ఏ మాత్రం ఆలస్యం చేయకుండా కొరియరులో పంపించమన్నప్పుడు కంప్యూటర్‌లో ఫీడ్ చేసుకోడానికి వివరాలు అడిగింది,

"అతనేం చదువుకున్నాడు?"

"మేథ్స్‌లో పి.జి. చేస్తున్నాడు."

"వయసు?"

ఉజ్జాయింపుగా చెప్పాను.

"రిఫరెన్స్?"

"నా పేరు రాయి".

"తలిదండ్రులు ఏం చేస్తుంటారు?"

"లేరు. అతని చిన్నప్పుడే చనిపోయారు".

"హోటలు మేనేజ్‌మెంటులో డిప్లొమా చేశాడా?"

"లేదు."

"ఏ స్టార్ హోటలులో నయినా పనిచేసిన అనుభవం ఉందా?"

"లేదు, మనం శిక్షణ ఇవ్వాలి."

"ప్రస్తుతం అతనికి జీతం ఎంతిస్తున్నారు?"

"ఏడొందలు".

"ఇప్పుడు ఎంత ఇద్దామని అనుకుంటున్నారు?"

"ఆ సంగతి నేనూ ఆలోచించలేదు, ఎంతివ్వొచ్చు?"

అయిదారు క్షణాలపాటు నాముఖంలోకి చూసింది. వీలయినంతమటుకు నా భావాల్ని ఎదుటివాళ్ళు చదివే అవకాశాన్ని ఇవ్వను. మరొకరు అయితే నన్ను ఇన్ని ప్రశ్నలు వేయరు. నా దగ్గరపనిచేసే చాలామంది నా ముందుకు రావడానికి భయపడుతుంటారు. నా పిల్లలు కూడా నాకు దూరంగా మెలుగుతుంటారు.

ఆమె నుండి ఎటువంటి జవాబు రాకపోయేసరికి, "అతనికున్న క్వాలిఫికేషన్స్‌తో ఎంతివ్వొచ్చో చెప్పు" అన్నాను.

"మూడు ఇవ్వొచ్చు".

"ఇంకో సున్నా కలుపు".

ఆశ్చర్యపోతూ నా ముఖంలోకి చూసి, 'ఎక్స్‌క్యూజ్‌మీ" అంది. తాను తప్పుగా విన్నానేమో అనుకుని ఉండాలి. అంత జీతం ఆమెకే ఇవ్వడం లేదు. నేను ఆమెకు కొత్తగా కనిపిస్తూ ఉండొచ్చు.

"ముప్పయికె" అన్నాను.

ఆమె నా గది లోంచి బయటకు వెళ్తోంటే, "మేకిట్ ఫాస్ట్" అన్నాను.

"యస్ సార్" అంది.

వరప్రసాద్ జీవితాన్ని మార్చబోతున్నందుకు నాకెంతో సంతోషంగా ఉంది. అతని ఆనందానికి పట్టుపగ్గాలు ఉండవనుకుంటాను. తన గురించి అతను నాతో ఒక్క ముక్కయినా చెప్పలేదు. ఆ రాత్రి మేమిద్దరం కలిసి భోజనం చేసినప్పుడు నా గురించి నేను చేబుతోంటే ఆసక్తిగా విన్నాడు. ఉదయం మేం నిద్రలేచేసరికి వేడి

కాఫీ తయారుచేసిచ్చాడు. టిఫిన్ తెప్పిస్తానన్నాడు. వద్దన్నాను. వచ్చేస్తూ రెండు వందల రూపాయలు అతనికి ఇవ్వబోతోంటే నవ్వుతూ తీసుకోలేదు. విజయవాడ వెళ్ళే దారి చూపించడానికి మాకూడా వరప్రసాద్ పంపించిన వ్యక్తి కారు దిగిపోయేటప్పుడు అన్నాడు, “వరప్రసాద్‌కు ఏడు వందలో, ఎంతో జీతం వస్తుంది. రెండువందలు మటుకు తను ఉంచుకుని మిగిలింది పుస్తకాలు కొనుక్కో లేని పిల్లలకు పుస్తకాలు కొనిస్తాడు. గుడ్డలు లేని పిల్లలకు గుడ్డలు కొనిస్తాడు. చాలామంది పేద పిల్లలకు ట్యూషన్లుచెప్పి మెరికల్లాటి వాళ్లగా తయారుచేశాడు.”

అపాయింటుమెంటు లెటరు పంపించి రెండు, మూడు వారాలు, నెలగడిచింది. వరప్రసాద్ రాలేదు. అది చేరిందో లేదో అని మరొకటి పంపించమన్నాను. పంపించారు. దానికీ అతని నుండి జవాబు రాలేదు. ‘మర్యాదకోసమయినా అతను జవాబు ఇచ్చి ఉండొచ్చు కదా, అనుకున్నాను. అతని మీదున్న అభిమానం కోపంగా మారాక ఫోను చేశాను. దొరికాడు. అతని మీద కోపంతో అరుద్దామనుకున్న వాడిని అతని కంఠస్వరం విన్నాక తగ్గాను.

“ఎలా ఉన్నావు?” అడిగాను.

“నమస్కారాలండీ. బావున్నాను. మీ ఉత్తరాలు అందాయి. నామీదమీకున్న అభిమానానికి కృతజ్ఞతలు ఎలా చెప్పుకోవాలో..” అతని మాటలు పూర్తికాకముందే అడిగాను, “ఎప్పుడొస్తున్నావు?”

అతను వెంటనే జవాబు చెప్పలేదు. సహనం అనవసరం అనిపిస్తోంది. “నేను నీకు ఆఫర్ చేసిన జీతం ఎవరూ ఆఫర్ చేయరు” అన్నాను.

“మీరంటే నాకు గౌరవం ఉంది. సమస్య మీతో కాదు.. నా తోనే.... నా మనసులో మాట చెబుతున్నందుకు దయచేసి మీరేమీ అనుకోకండి. జీతం కాదు. నేనిక్కడుంటే కొన్ని జీవితాలను వెలిగించిన వాడినవుతాను. ఇంకోటి ఏమిటంటే.. నేను మీ దగ్గర ఇమడలేనండీ.... ఎదుటి వ్యక్తిలోని ఆత్మను మీరు ఎదగనీయరు...” అంటున్నాడు. ఫోను పెట్టేశాను.

❖ ఆదివారం వార్త, 23 నవంబర్, 2008